# వాల్మీకికి కోపం వచ్చింది

వాల్మీకికి కోపం వచ్చింది.

రావణాసురుడు సీతను ఎత్తుకుపోయినప్పుడు వాల్మీకికి కోపం రాలేదు. రావణవధ జరుగుతుంది కదా అని ఆనందం కలిగింది.

హనుమంతుడు లంకాదహనం చేస్తున్నప్పుడు వాల్మీకికి కోపం రాలేదు. అది చూసి ఉత్సాహం కలిగింది.

సీతాదేవిని లక్ష్మణుడు అడవిలో విడిచిపెట్టినందుకు వాల్మీకికి కోపం రాలేదు. వేదన కలిగింది.

శ్రీరామచంద్రుడు శంబూకుణ్ని వధించినప్పుడు వాల్మీకికి కోపం రాలేదు. వృత్తుల కోసం ఏర్పరిచిన వర్ణవ్యవస్థ ఇలాంటి వాటికి తోడ్పడుతుందేవిటని ఆవేదన కలిగింది.

కొన్ని వేల సంవత్సరాల తర్వాత వాల్మీకికి మొదటిసారిగా కోపం వచ్చింది.

ఇప్పుడా అడవి చీమలు దూరని చిట్టడవీ కాదు. కాకులు కూయని కారడవీ కాదు. పక్షులూ, జంతువులూ పేరుకు మాత్రం అడవిలో వున్నాయి. చెట్లూ పొదలూ దట్టంగా లేవు.

అప్పుడెప్పుడో గంధం, టేకు చెట్లను పెద్ద ఎత్తున నరుకుతున్న శబ్దాలకు తపస్సు భంగమై కళ్లు తెరచి, మౌనంగా ఓ గుహలోకి వెళ్లిపోయాడు వాల్మీకి. అక్కడే తపస్సు చేసుకుంటూ వుండి పోయాడు.

మళ్లీ ఇన్నాళ్లకు కళ్లు తెరిచాడు. ఒళ్లు విరుచుకున్నాడు.

అ శరీరవాణి కనుక గొంతెత్తి అరవకపోతే, పిలవకపోతే వాల్మీకి కళ్లు తెరిచేవాడు కాడు. ఈ దేశ దౌర్భాగ్యాన్ని చూసే వాడు కాదు. కోపం వచ్చేది కాదు.

వాల్మీకి ఆలోచనలోపడ్డాడు. పసుపుచారల పులొకటి తెల్ల చుక్కల లేడిపై పంజా విసరబోయి, వాల్మీకి మహర్షికి తపో భంగమవుతుందేమోనని ఆగిపోయింది. పచ్చని చెట్టు విసురుగా తలూపబోయి నిటారుగా నిలబడి పోయింది.

ఆలోచన్ల నుంచి బయటపడలేదు వాల్మీకి.. రామాయణాన్ని తనెందుకు రాశాడు?

లోక కళ్యాణం కోసం.

మరి జరుగుతున్నదేమిటి? రాముడు పాత్రను తనెందుకు సృష్టించాడు?

మానవుడిలో ఒక ఉన్నత వ్యక్తిత్వం ఏర్పడ్డం కోసం. చెడును నిర్మూలించి మంచిని పెంచడం కోసం. ధైర్యసాహసాలను అలవర్చడంకోసం. బహుభార్యాత్వాన్ని అంతం చెయ్యడంకోసం. ఈ సుగుణాలవల్లే కదా రాముడు సుందర రాముడయ్యాడు.

జానకిపాత్రను తనెందుకు సృష్టించాడు?

స్త్రీలలో పాతివ్రత్యాన్ని పవిత్ర ఆదర్శంగా నిలపడం కోసం. విశృంఖలత్వాన్ని విరమింపజేయడం కోసం. కుటుంబవ్యవస్థ కుంటుపడకుండా కొనసాగడం కోసం. ఈ సులక్షణాలవల్లే కదా సీతాదేవి ఘన శీలవతిగా గణుతికెక్కింది.

లక్ష్మణపాత్రను తనెందుకు సృష్టించాడు?

అన్నమాట జవదాటరాదని చెప్పడం కోసం. సహోదరులు సఖ్యంగా వుండడం కోసం, ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుని రాజ్యాన్ని ముక్కలుచేసి, ప్రజల్ని యుద్ధానికి దింపి వినాశనాన్ని కోరితెచ్చుకోకుండా వుండడం కోసం.

జటాయువుపాత్రను తనెందుకు సృష్టించాడు? నలుగురికోసం పోరాడడం ధర్మమేకాదు, సృష్టి ధర్మం కూడానని ఎరుకలో వుంచడం కోసం. దుష్టుడు ఎంత బలవంతుడని ఆలోచించకుండా ఎదుర్కోవాలనే తత్వాన్ని ప్రతిష్టించడం కోసం.

ఇన్ని లక్ష్యాలతో, ఇంతటి ఆదర్శంతో అన్నేళ్లు అంతగా శ్రమించి తను రాసిన రామాయణాన్ని వీళ్లెందుకు సరిగా అర్ధం చేసుకోలేదు? తన కావ్యం కొన్ని యుగాల పాటు నిలిచి వుండడం కవిగా తనకు గర్వకారణమే. నాటి సమాజంపట్ల ఒక బాధ్యతతో తాను రచించిన రామాయణం నేటి సమాజానికి అక్కరకొస్తే అంతకంటే కావల్సిన దేముంది? కానీ, జరుగుతున్నదేమిటి?

నడుంవరకూ పెరిగిన గడ్డాన్ని నిమురుకుంటూ వాల్మీకి అలా ఆలోచిస్తూనే దివ్యదృష్టితో చూశాడు.

అక్కడంతా కాషాయరంగుమయం. వేలాది భక్తులు. జేవురించిన మొహాలు. జై భజరంగ భళీ అంటూ అరుపులు. "రామజన్మభూమి అజన్మాంతం మనది. రాముడు పారాడిన నేలను రక్తధారాలతోనయినా రక్షించుకుందాం" అంటూ

నినాదాలజోరు.

అక్కడున్న మసీదుపైకి కొందరు పాకుతున్నారు. వాళ్లచేతుల్లో పలుగూ పారలూ. మూఢభక్తి పారలు కమ్మిన కళ్లజీరలు. మసీదు మీదకు పాకుతున్న ఆ నరులు వాల్మీకికి వానరుల్లా కనిపించారు. వెంటనే హనుమంతుడు గుర్తొచ్చాడు.

వాళ్లలా కనిపించగానే వాల్మీకి వాళ్లగుండెల్లోకి చూశాడు. అక్కడ రాముడు లేడు. మతోన్మాదపు మురికి వుంది.

అసహ్యంగా ముఖం పెట్టి, వాల్మీకి వాళ్ల మెదళ్లలోకి చూశాడు. ఆ మెదళ్లలో ఆ దేశపు ఆవేశం.

వాల్మీకి మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

ఎక్కడిదీ మతం? ఏమిటీ మతం?

హిందూమతం. జైన మతం. బౌద్ధమతం. ముస్లిం మతం. క్రైస్తవ మతం. హిందూమతంలో మళ్లీ ఎన్నో... వైష్ణవం. శైవం....

మతం ఎందుకు? రామజన్మభూమి కోసమా? మరు భూమి కోసమా? ఈ మతాలెందుకని ఇంత వరకూ ఎవరూ ప్రశ్నించలేదా?

గురజాడ కనిపించాడు. "మతములన్నియు మాసిపోవును జ్ఞానమొకటి నిలిచి వెలుగును". వేల సంవత్సరాల క్రితమేసత్యకామ జాబాలి,చార్వాకులు వంటి వాళ్లు మత మహమ్మారిని ఖండించి, మానవతా వాదాన్ని వేదనినాదం చేయడం కళ్ల ముందు కదిలింది.

వాల్మీకి దివ్యదృష్టి అవిభక్త భారతదేశాన్ని దాటి వెళ్లలేక పోయింది.

"వాల్మీకి మహర్షీ. మతం మత్తు మందు" లాంటిదని మార్క్స్ మహర్షి ఈ ప్రపంచాన్ని హెచ్చరించాడు. ఆ స్ఫూర్తితో "కులం కులం అనీ కొట్టుకోకు కూటికి లేనివాడా, మతం మతం అనీ మాత్సర్యం పెంచుకోకు మతిమాలిన వాడా" అంటూ కొంత మంది కవులు ప్రచారం చేశారు. కొందరు కొట్టిపారేశారు" అంది అశరీరవాణి.

"అలాగా" అని తలపంకించాడు వాల్మీకి కళ్లు మూసుకుంటూ.

"మహర్షీ ఓసారి అలా చూడు" అంది అశరీరవాణి.

వాల్మీకి కళ్లు తెరచి చూశాడు. కళ్లెదుట ఏమీ కనిపించలేదు. దివ్య దృష్టితో చూశాడు.

కాషాయరంగు దుస్తులవాళ్లు కొందరు మసీదును పగల గొడుతున్నారు

"ఈ వా-నరులకదేం పని" అనుకున్నాడు వాల్మీకి.

ఆయన కళ్లముందు గతం కదలాడింది. "రామరాజ్యం" ముక్కలయింది. రాష్ట్రానికో రాజు, జిల్లాకో రాజు పుట్టుకొచ్చారు. ఒక రాజుతో మరొక రాజుకు పడలేదు. ఒకరిపైకి మరొకరు దండెత్తారు. రాజ్య నష్టం, జన నష్టం. ముక్కలైన రామరాజ్యం బలహీన పడింది. మహమ్మదీయులు దండెత్తారు. పిరికి రాజులు బరిలోకి దిగలేక తోక ముడిచారు. ఒకరిద్దరు పెంకి రాజులు పోరాడి ప్రాణాలు కోల్పోయారు. రామరాజ్యంలో 'అల్లా' రాజ్యం ప్రారంభమయ్యింది. ఆ రాజులు కొందరు పరమత సహనం చూపారు. కొందరు చూపలేక పోయారు. అనేక దేవాలయాల స్థానంలో మసీదులు లేచాయి.

వాల్మీకి నిట్టూర్పు విడుస్తూ అటు చూశాడు. మసీదు నేలమట్టమయింది. కాషాయరంగు దుస్తుల వాళ్లు చెంగుచెంగున గెంతుతూ హాహాకారాలు, నినాదాల హోరు. రావణ సంహారానంతరం వానరుల చేష్టలు వాల్మీకికి జ్ఞాపకానికొచ్చాయి.

"ఆ వానరుల కుప్పిగెంతుల్లో కొండత అర్థముంది. రాక్షస సంహారం జరిగిందనే విజయానందాన్ని వారప్పుడు వ్యక్తం చేయడంలో పరమార్థముంది. మరి విధ్వంసానికీ, వినాశనానికీ పాల్పడిన ఈ వానరుల కెందుకీ విజయ దరహాసాలు? వికృతంగా లేవూ? వికృత చర్యలవల్లే కదా రావణుడి స్వరూపం వికృతమయ్యింది. మతం ఇంత వికృతమయినదా? మతానికి ఏ రవివర్మో ఒక ఆకృతి ఇస్తే అది పది తలల రావణాసురుడంత వికృతంగా వుంటుంది కదూ" అనుకున్నాడు వాల్మీకి.

"రాముడు పుట్టిన ఈ నేలలో..." అంటూ నినాదాలు మళ్లీ మొదలయ్యాయి.

వాల్మీకి తీక్షణదృష్టితో చూశాడు. రాముడక్కడే పుట్టాడా? రాముడెక్కడ పుట్టాడో తనకప్పుడు తెలుసు కదా. అప్పటి పరిసరాలు, భవనాలు వాల్మీకి కళ్ల ముందు కదిలాయి. నేల మట్టమయిన మసీదు ప్రాంతమంతా జాగ్రత్తగా గమనించాడు. అప్పటికీ ఇప్పటికీ అసలు పోలికే లేదు. ఆ పరిసరాలూ ఆ భవనాలే వేరు. ఈ పరిసరాలూ ఈ భవనాలే వేరు.

అదే ఇదా? ఇదే అదా? అవునా కాదా? ఏమో!

తను కళ్లారా చూసిన రామజన్మభూమి ఇదో కాదో తానే తేల్చి చెప్పలేక పోతున్నాడు. మరి, వీళ్లకెక్కడిదీ నమ్మకం? వాళ్ల మెదళ్ల మొదళ్లలోని ఆదేశపు ఆవేశపు, అనాలోచిత జిగురు ఆయన కళ్లల్లో కదిలింది.

ఆదేశాలిచ్చిన నేతల హృదయాల్లోకి చూశాడు వాల్మీకి. వాళ్లకక్కడ హృదయాల్లేవు. నల్లటి అధికార కాంక్షల ముద్దలు. గుండ్రంగా తిరుగుతూ ఓంద్ర పెడుతూ.

వాల్మీకి కళ్లు మూసుకుని, "ఏ ఒక్కరి కోసమో పెక్కురు మతోన్మాదపు విషవలయంలో పరిభ్రమిస్తుండడం ఎంత దారుణం! అదీ, నేను ఏరి, కోరిన "రామరాజ్యం"లో... అవునూ, ఈ మూఢ భక్తులందరూ ఆ ఒక్క ప్రాంతంలోని వారేనా" అనుకుని, మళ్లీ దివ్యదృష్టితో చూశాడు.

దేశం నలుమూలలనుంచీ వచ్చిన వాళ్లు కనిపించారు. వాల్మీకి పెద్దగా నిట్టూర్చాడు. కోపంగా నుదురుకొట్టుకున్నాడు. కళ్లు మూసుకున్నాడు.

"మహర్షీ, మతమౌఢ్యం ఈ ఒక్క దేశంలోనే వుందనుకోకు. కొన్ని దేశాల్లో అయితే మరీనూ" అంది అశరీరవాణి.

"అలాగా" అన్నాడు వాల్మీకి కోపంతో మరింత ఉద్రేకపడిపోతూ.

ఆ కట్టడం కూల్చివేత తర్వాత జరిగిన మత ఘర్షణల్లో వందల మంది మరణించడం చూసి, వాల్మీకికి దుఃఖంతోపాటు కోపమూ పెరిగింది. ఆయన ముఖం వివర్ణమయింది. ముసలి దేహం వణికిపోయింది. వాల్మీకి కనుబొమలు విల్లుల్లా వంగాయి. కళ్లు మూసుకున్నాడు. ఆయన మనసులో ఆలోచన్ల సాగర మథనం.

"శ్రీరాముడి పట్టాభిషేకంతో రామాయణం పూర్తిచేసి, సమాజం పట్ల నా బాధ్యత తీరిందనుకున్నాను. కానీ, ఉత్తర రామాయణం రాయవలసి వచ్చింది. అక్కడితో నా బాధ్యత తీరిందనుకుని తపస్సమాధిలో వుండిపోయాను. అయితే, ఇప్పుడు ఆధునిక రామాయణం రాయవలసిన అవసరం వచ్చింది. రాయక తప్పదుమరి" అనుకున్నాడు వాల్మీకి.

"మహర్షీ, ఈ వయసులో కూడా నువ్వీ పనికి పూనుకోవడం అభినందించతగ్గ విషయం. శుభమస్తు, అవిఘ్నమస్తు" అంది అ శరీరవాణి.

ఆధునిక రామాయణం రాయడానికి వాల్మీకి శ్రీకారం చుట్టాడు. ఇందులో వీరభక్త హనుమాన్ పాత్ర వుండదు. తను కూర్చున్న కొమ్మను తనే తెగనరుక్కునే కోతిపాత్ర వుంటుంది.

*(సుప్రభాతం పక్షపత్రిక, 20 మార్చి 1993)*